వనితాలోకం:

# విధి ప్రతికూలమయితే

## మధిర భానుమూర్తి

ఎంత మరిచిపోదామన్నా మరిచిపోలేకుండా ఉంది సరస్వతి. ఎక్కడ ఉంటున్నా, ఎక్కడ కూచున్నా, ఏం తింటున్నా ఏ పని చేస్తున్నా రావే కనిపిస్తున్నాడు కంటికి. రావు చనిపోవటం, అంత్యక్రియలు జరగటం, ఆ గాడు తనకి ప్రపంచంలో ఇక ఏ పట్టుకొమ్మా లేదని పెద్ద బాధ రావటం...ఇవన్నీ తను ఎరిగున్న విషయాలే అయినా రావుని గురించి ఆలోచన వచ్చినప్పుడల్లా రావు మరణం అబద్ధమేమో నన్నంత ప్రత్యక్షంగా రావు తనకి కనిపిస్తున్నాడు. తనతో మాట్లాడుతున్నాడు. "అమ్మా!" అని ఆప్యాయంగా పిలుస్తున్నాడు. ఇవన్నీ తను కాదనలేదు. కాని ఆ మాట ఎవరికేనా చెప్తే మాత్రం వాళ్లు నమ్మరు. ఇదంతా భ్రమ అంటారు. నిజముగా వాళ్లకెవరికీ రావు కనిపించకపోవటంవల్ల అలా అంటారో, లేక తనను ఓదార్చటానికి అలా అంటారో ఇప్పటికీ తనకి అర్థం కాదు. కాకపోతే ఏమిటి?.. వాడు చదువుకునే గది తలుపు మొన్న తీసేసరికి వాడు కుర్చీలో కూచుని చదువుకుంటున్నాడు తను తలుపు తీసిన అలికిడికి తనవైపు తిరిగి 'ఏం అమ్మా?—ఇలా వచ్చావు?' అని అడిగాడు 'నువ్వు ఇక్కడున్నావా' అంటూ తను ముందుకు వెళ్ళింది కుర్చీ దగ్గరకి తను వెళ్లేసరికి అక్కడ లేడు..అంతలో ఎక్కడికి వెళ్లాడో!...

ఈ మధ్యన ఎప్పుడూ అలాగే చేస్తున్నాడు. కనిపించినట్టే కనిపించటమూ, తీరా దగ్గరకి వెడితే అక్కడ ఉండకపోవటమూ. తనమీద ఏమైనా కోపం వచ్చిందేమో! ..అయినా కోపం ఎందుకు? తను వాడికి కోపం వచ్చే పని ఏదైనా చేసిందా అంటే ఏమీ లేదు. ఈ మాట ఆయన్ని అడిగితే "ఇంకెక్కడి రావే!...వాడు మనని విడిచిపోయి నెల అవుతూంటేను?..నీకేమైనా పిచ్చెక్కిందా?" అన్నారు. పైకి ఈ మాటలు మొండి ధైర్యంతో అన్నా గాని ఆయనకీ లోపల బెంగ లేకపోలేదు. ఆమాట ఆయన అన్నాక తనకి జ్ఞాపకం వచ్చేది, నెల రోజులనాడు రావు పోయాడన్న సంగతి

అవాళ ఆ మాటలు విని తను కొయ్యబారిపోయింది. చెట్టంత కొడుకు. చేతికంది వచ్చాడు. ఏదో వాడి మానాన వాడు బ్రతకటమే కాకుండా ఇంటిల్లపాదినీ పోషించే స్తోమతు సంపాదించాడు...చాలా తెలివైన వాడు. చదువుకునే రోజుల్లో తన తెలివితేటలవల్ల ఉపాధ్యాయులను మెరిపించి స్కాలరుషిప్పు సంపాదించుకున్నాడు. వాడికి మంచి భవిష్యత్తు ఉందని అందరూ అన్నారు. దానికి తార్కాణంగా వాడికి మొదట్లోనే మూడు వందల రూపాయల జీతం వచ్చే ఉద్యోగమయింది పైగా వాడొక్కడే మగపిల్లవాడు. వాడి తరువాత వరసగా నలుగురూ ఆడపిల్లలే ఇంట్లో తండ్రి తరవాత తండ్రి అంతటివాడు. అలాంటి వాడు పోయాడంటే బాధే!... అందులోనూ ఎన్నడూ రెండు లంఖణాలైనా చేసి ఎరుగనివాడు, అకస్మాత్తుగా పోయాడంటే ఆ బాధ మరింత ఎక్కువగా ఉండటం సహజమే! పైగా తను ఆ రోజునే ఊరు వెళ్లటం వల్ల మరింత ఎక్కువైంది తన బాధ. పోయే సమయానికి దగ్గిర లేకపోయానుగదా అని ఎంతో విలపించింది. ఏమిటో అలా అనుకోవటమే గాని ఉండిమాత్రం తనేం చెయ్యగలదు? ..పోయేవాడిని ఆపగలదా! ...ఆ శక్తి లేదుగా మనుష్యులకి...కాని అలా అనిపించదు. తనే దగ్గిర ఉండిఉంటే ఉపచారాలు జాగ్రత్తగా చేస్తూ, ఏ వేళ ఏం కావాలో కనిపెట్టుకుని చూస్తూ కాలక్షేపం చేసును కాని అలా జరగలేదు. అందుకే విచారిస్తుంది సరిగ్గా ఆరోజే ఊరు వెళ్ళినందుకు తనని తను ఎన్నిసార్లో తిట్టుకుంది ..

తను ఇలా అనుకుంటూంది గాని ఆయన దగ్గరే ఉన్నారుగదా! .....ఆయన ఏం చెయ్యగలిగారు...ఆయనకుమాత్రం వాడిని బ్రతికించుకోవాలని ఆశ లేదూ?... వాడు తన కంటో ఆయనకీ అంతేగా?...ఆమాటకి వస్తే తనకన్న ఆయనే వాడిని గారాబంగా చూసేవారు కోపం వస్తే తను కొట్టేది అప్పుడప్పుడు కాని ఆయన మాత్రం ఎప్పుడూ వాడిమీద చెయ్యి చేసుకోలేదు...

అక్కడికీ చేతనయినంతవరకు ఆయన ప్రయత్నించారట ఊళ్ళో ఉన్న పెద్ద పెద్ద డాక్టర్లనందరినీ పిలిపించారట. ఆ ఒక్క రోజు వైద్యానికి అయిదారు వందలు ఖర్చు చేశారట. ఎంత ఖర్చయినా గాని లెక్కలేకుండా చెయ్యగలిగారు గాని, ఆయన వాడికి ప్రాణాన్ని పొయ్యగలిగారా?... అంత పలుకుబడి, డబ్బు ఉండి ఆయనే చెయ్యలేని పని తను ఎలా చెయ్యగలదు?.. నిజానికి తను అవాళ దగ్గరఉంటే వాడి స్థితిమూసి తను పెట్టే ఏడుపులు పెడబొబ్బలతోటి ఆయనకి బొత్తిగా ధైర్యంపోయి కాళ్లుచేతులు ఆడక పోను. అంతవరకు అది మేలుగ! కాని తన బెంగ ఎలాపోతుంది?...పదినెలలు మోసి కని వాడిని పెంచేందుకని రోజులు, నెలలు, సంవత్సరాలు లెక్క చెయ్యకుండా కష్టపడి చివరికి వచ్చేసరికి, ఆ సమయానికి, తను లేకపోవటం తనకి బాధ కాదూ? ...ఆ బాధ వల్లే తనే ఉండి ఉంటే?' అనిపిస్తుంది; తనుఉండి చేసే దేమీ లేకపోయినా. ఇంతకీ వాడికీ తనకీ అంతటితో ఋణం తీరిపోయింది. కాకపోతే ఏమిటి?...

ఆ రోజున తనని చూట్టానికి వచ్చినవాళ్ళంతా అదే మాటన్నారు. "ఏం చేస్తాం?.. వాడికి అంతటితో సరిపోయింది... ఇదేం మన చేతుల్లో పనా? ..ఏదవకు...గుండె రాయి చేసుకోవాలి..." అంది సుబ్బమ్మ.

"కాగుటమ్మా!...బాధ ఉంటుంది... సహజం...కన్న కడుపా మరొకటా!... చూసేవాళ్ళకి మనకే ఇలా ఉంటే అదివాళ్ళ ఉండటానికేం?..... ఇంతకీ అంతే పెట్టి పుట్టింది...లేకపోతే రత్నంలాంటివాడు - వాడికి చావేమిటి...చెప్పండి?" అంది లలితమ్మ.

"అంతే మరి!...ఏడిస్తే మాత్రం మళ్ళీ వస్తాడా? . ఏం చేస్తాం? ఆ భగవంతుడికి దయ లేకపోయింది. నిక్షేపంలాంటి వాడిని తీసుకుపోయాడు" అంది సూర్యకాంతం.

"ఏమనుకుంటే ఏం లాభం?...రారాని కష్టం వచ్చింది...కుటుంబం అంతా వాడిమీదే ఆశలు పెట్టుకు బ్రతుకుతుంటే వాళ్లందరినీ వదిలేసి తన త్రోవని తను వెళ్ళిపోయాడు .." అంటూ తన చీరకొంగుతో కళ్లు ఒకసారి తుడుచుకుంది మంగమ్మ.

"నువ్వే ఇలాగ బెంగ పెట్టుకుంటే ఇంక ముసలాయన- ఆయన మరి ఇదయిపోతారు. ...కాస్త ధైర్యం చెప్పద్దూ ఆయనకి? పిల్లలు మొగుడు ఎలా ఇదయిపోతున్నారో! ..." అని సలహా యిచ్చి వెళ్లిపోయింది వెంకాయమ్మగారు

ఇలాగ అందరూ తలొకసారి వచ్చి ఏదో వేదాంత ధోరణిలో మాట్లాడి వెళ్ళిపోయేవారు. అంతా ఖర్మ అని; కాలం సమీపించబట్టే గాని లేకపోతే వాడు పోవటం అన్నది అసంభవం అని; ఇలాగ అందరూ అంటారు గాని తను వాటిని విశ్వసించలేకుండా ఉంది.. కాని ఆలోచించగా అదే నిజమేమోనని కూడా అనిపించక పోలేదు..

# ★ విధి ప్రతికూలమయితే ★

అసలు ఎవరో తన కొడుకుమీద పగపట్టి ఇలా చేశారని తనకి అనుమానంగానే ఉంది లేకపోతే తన కొడుక్కి అంత అకస్మాత్తుగా కలరా రావటమేమిటి?...అంతకుముందు రోజు మామూలుగా ఆఫీసుకి వెళ్ళివచ్చాడు. రాత్రి అందరితోపాటు సరదాగా కబుర్లు చెప్తూ భోంచేశాడు. తెల్లవారగట్ల తనతో కూడా లేచాడు. తను ప్రయాణమయి వెడుతుంటే స్టేషనుదాకా వచ్చాడు రైలు ఎక్కించటానికి. రైలు కదలబోయే ముందు "మామయ్య వ్రాసిన పెళ్ళికొడుకుని చూసి రావే అమ్మా!...అన్నీ బాగుంటే సుశీకి ఈఏడు పెళ్ళి చేద్దాం!" అన్నాడు. అలాంటిది ఇంటికి వెళ్లటంతోటే ఒక విరోచనం, డోకు వెళ్ళాయట. అంతే! అక్కడనుంచి వరుసగా!.. సాయంత్రానికి స్పృహ లేదట సూర్యోదయం కాకముందే పోయాడట!... ఇంతకన్న ఘోరమేదైనా ఉందా?...పది గంటలయేసరికి తను టెలిగ్రాం అందుకోవటం, రావటం, అంతకుముందురోజు తనతో నవ్వుతూ సుశీ పెళ్లినిగురించి మాట్లాడిన తనకొడుకు కళేబరం మాత్రమే చూడగలిగింది ఇవాళ. ఇప్పుడిక వాడికి ఈ ప్రపంచంలో ఏ విషయంతోనూ సంబంధం లేదు.. ఏ బాధ్యతా లేదు ... ఏ కోరికా లేదు... ఎంతలో ఎంత పని జరిగింది?... ఆ వ్యాధి తీరు అలాంటిది.

ఏమో!.. అలాగని మాత్రమేమిటి? ... ఇదివరకు ఎందరు కలరా వచ్చి బ్రతకలేదు. తన కొడుక్కి వచ్చినప్పుడే అది అంత ప్రమాదమైన వ్యాధి కావాలా?...ఆ రోజే ఇంకా ఎందరికో వచ్చింది. కాని వాళ్లంతా బాగానే ఉన్నారు. తన కొడుకు ఒక్కడే బలి అయాడు...తను అంతే నోచుకుంది...

ఇప్పుడనేమిటి?.. తన నోముల ఫలితం మొదటినుంచి అంతంతగానే ఉంది. చిన్నప్పుడు ఎంతకాలం ఏ బాధ్యతా, బాధ లేకుండా కులాసాగా గడిపిందో!...అంతే! తనకి యుక్తవయస్సు వచ్చినప్పటినుంచి తండ్రికి ఒక సమస్యగానే తయారయింది. అనేకవిధాల ప్రయత్నం చేశాడు తనకి పెళ్ళిచెయ్యాలని. కాని వీలుకాలేదు ... చివరికి ఎలాగో ఈయనను వెదికి తెచ్చాడు నాన్న. ఈయనకి అప్పటికి సుమారు నలభై ఏళ్లుంటాయి అంతవరకు ఏదో ధోరణిని ఉండేవారట. జీవితం అంతా బ్రహ్మచారిగానే గడపాలని ఉందని, ఉత్తమ లక్ష్య సాధనకై కృషి చెయ్యాలని ఉందని అనేవారట. అందుకోసమే ముప్ఫై అయిదేళ్లు వచ్చేవరకు పెళ్ళిమాట తలపెట్టనేలేదట. అప్పుడు ఆయనకి అనిపించిందట - తన జీవితానికి అనుకూలవతి అయిన సహధర్మచారిణి ఎంతో అవసరమని ఆమాట ప్రసంగవశాత్తూ మిత్రులతో అన్నారట. అది ఆ నోట ఆనోట తన తండ్రివరకూ వచ్చింది నాన్నకి ఆ సంబంధం నచ్చింది. నిశ్చయిస్తానన్నాడు. అమ్మ వల్లకాదంది. ఆయన వయస్సు ఎక్కువని అభ్యంతరం చెప్పింది. తనకీ అలాగే అనిపించింది. కాని గత్యంతరం లేదు. కొంత తర్జన భర్జన అయాక అందరూ ఒప్పుకున్నారు పెండ్లి బాగానే జరిగిపోయింది. అప్పటినుంచి తను ఆయనతోనే ఉంది

పెళ్ళయిన రెండేళ్ళకే తనకి కొడుకు పుట్టాడు - రావు. వాడిని చూసి తన తల్లి తండ్రీ ఎంత పొంగిపోయారు! అసలు తన జీవితంలో పెళ్ళిచెయ్యలేమనుకున్నవాళ్ల చేతికి మనుమడిని అందిస్తే వాళ్ళ సంతోషానికి అవధులు లేకపోయింది. ఆయనకూడా రావు పుట్టుకతో మారిపోయారు అంతవరకు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూండేవారు. ముఖం ఎప్పుడూ గంభీరంగా ఉండేది. ఇలా ఉండగా ఆయనతో మాట్లాడటంకూడా భయం వేసేది తనకి. ఈయనకి ఈ ధోరణి ఎక్కువయి ఉన్నట్టుండి ఏ సన్యాసులలోనో కలిసిపోతారేమో!...అప్పుడు తన గతేమిటి? అని ఎంతో బాధపడేది. అహోరాత్రులు అదే ఆలోచనతో గడిపేది. ఆలోచించినకొద్దీ భయం వేసేది తనకి. అలాంటిది రావు పుట్టాక ఆయన మామూలు మనిషయారు. ఇదివరకు ఇంటిమీద అంత శ్రద్ధ చూపనివారల్లా రావుకోసమేనా ఇంటిమీద ఎక్కువ శ్రద్ధ చూపేవారు ఇలాంటి మార్పు ఆయనలో వస్తుందని తను కలలో కూడా అనుకోలేదు.

రావు తరువాత ముగ్గురు మగపిల్లలు పుట్టిపోయారు. దాంతో తను, ఆయన కూడా రావు విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకోవటం మొదలుపెట్టారు కంటికి రెప్పలాగ కాపాడేవారు. వాడు జాగ్రత్తగా చదువుకుంటున్నాడు. ఇలా ఉండగా తనకి ఆడపిల్లలు పుట్టటం ప్రారంభించారు. సుశీతో ప్రారంభమై వరుసన అంతా ఆడపిల్లలే!... ఉన్న ధనం అంతా రావు చదువుకే అయిపోయింది. ఆయనకా ఉద్యోగం లేదిప్పుడు. చేసినది సర్కారు నౌకరీ కాకపోవటంవల్ల పింఛనయినా లేదు. ఈ పరిస్థితుల్లో నలుగురు ఆడపిల్లలు. అంతా చిన్న చిన్నవాళ్లే! .. ఇంకా వాళ్లు పెరిగి, పెద్దవాళ్లయి పెళ్లి పేరంటం జరిగి, ఒక అయ్యకి ఇల్లయినప్పుడుగదా తన మనసుకి ఊరట!...

అయితే ఇందులో 'గుడ్డిలో మెల్ల' అన్నట్టుగా రావుకి కాస్త శుభ్రమైన ఉద్యోగం దొరికింది. ముందువెనకలు చూడకుండా వాడికి వీలున్నంతవరకు చదువు చెప్పించటంవల్లే ఈనాడు కుటుంబ భారమంతా వాడు మొయ్యగలుగుతున్నాడు. ఇక వాడికి పెళ్లి చేసినట్లయితే వాడి విషయంలో తన బాధ్యత ఏమీ ఉండదనీ, మిగిలినవాళ్ళ బాధ్యత వాడే వహిస్తాడనీ ఆశించారు ఆయన. ఆ మాట వాడితో కదిపితే, ముందు సుశీలకి పెళ్ళిచేశాక ఈమాట ఆలోచించవచ్చు నన్నాడు. అప్పుడే వాడికి బాధ్యత నాటినందుకు ఆయన సంతోషించారు. తనకు వయస్సు మీరినందుకు పుత్రుడు చేతికి అందాడుగదా అని తృప్తిపడ్డారు ..అవును మరి! ఎందుకు నాటదు? ఒక్క సుశీకి పెళ్లి చెయ్యగానే సరా?... దాని వెనకాల ఇంకా ముగ్గురున్నారు... ఆఖరి పిల్లకి మూడేళ్ళయినా నిండలేదు... ఏది ఏమయినా వాడిమీద తగని భారం మోపారు తను ఆయనా కలిసి అనిపించింది తనకి. కాని తప్పదుగా, అనుకుంది అంతలోనే.

ఇప్పుడిప్పుడే సుశీకి సంబంధాలు చూడటం కూడా మొదలుపెట్టాడు తండ్రికంటె ఎక్కువ శ్రద్ధగా ఉన్నాడు. వాడి పోషణలో తనకి కూడా బాధలేదని తను నమ్మింది.

ఇలా ఉండగా రావుకి కలరా రావటం, ఆనాడే పోవటంకూడా జరిగాయి. ఇంతవరకు గుట్టుగా కాలక్షేపం చేస్తున్న సంసారం వీధికెక్కినట్టే. ఇంతవరకూ ఏ కొమ్మ నాధారం చేసుకుని తమ జీవిత శేషం గడపాలనుకున్నారో, ఆ కాస్త ఆధారం లేనిదయింది. ఉన్న స్థిరం అమ్ముకుంటేనే గాని రోజు గడవదు. ఆయనకా బొత్తిగా వార్ధక్యం వచ్చింది. సంపాదన ఏమీ లేకపోగా మనిషి ఆసరా కావలసిన స్థితి వచ్చింది. పిల్లలంతా పసివాళ్లే! వీళ్ళతోటి తను ఇంక రోజు ఎలాగ గడపటం? ఏది ఆధారంగా తీసుకుని తను జీవితయాత్ర నడపటం?...ఎవరి చేయూతతో పిల్లలని పెద్దవాళ్ళని చెయ్యటం? ... ఈ ఆలోచనలతో తనకి మతిపోతోంది. పైగా 'పుత్ర వియోగం'. క్షణ క్షణం జ్ఞాపకం రావటం. ఇదంతా ఎంత మరచిపోదామన్నా మరచిపోలేకుండా ఉంది. సరస్వతి...అంతకు ముందు రోజున ఇక తనకు తన సంసారానికి ఏ చింతా లేదని గుండెలమీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రించిన తను ఇప్పుడు తనకు, తన సంసారానికి ఏవిధమయిన ఆధారము లేదని వాపోవలసిన స్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు ...తనింతే నోచుకుంది కాబోలు... దాని నెదిరించే శక్తి తనకి లేదు. ★